

బంజారాహిల్స్ లీలా హోటల్‌లో యంగ్ ఫిక్కీ లేడీస్ ఆర్గనైజేషన్ సదస్సులో ప్రముఖ ఆర్ట్ డిజైనర్ శాలినీ పాసి తదితరులు

## సోషల్ మీడియాలో కనిపించేది మాత్రమే అందం కాదు

**ప్రముఖ ఆర్ట్ డిజైనర్ శాలినీ పాసి**

బంజారాహిల్స్, ఫిబ్రవరి 27: అందం అంటే కేవలం సోషల్ మీడియా వేదికలలో కనిపించేది మాత్రమే కాదని, మనసుతో చూస్తే ప్రతి ఒక్కరిలో, ప్రతి వస్తువులో అందం కనిపిస్తుందని ప్రముఖ ఆర్ట్ డిజైనర్ శాలిని పాసి అన్నారు. యంగ్ ఫిక్కీ లేడీస్ ఆర్గనైజేషన్ (వైఎఫ్ఎల్‌వో) ఆధ్వర్యంలో గురువారం బంజారాహిల్స్‌లోని లీలా హోటల్‌లో ఏర్పాటు చేసిన సదస్సులో భాగంగా 'రిఫైనింగ్ గ్లామర్ అండ్ ఇన్‌ఫ్లూయెన్స్' అనే అంశంపై చర్చించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన శాలిని పాసి మాట్లాడుతూ, ఎదగాలని మనస్ఫూర్తిగా నిర్ణయించుకున్న మహిళ కంటే శక్తిమంతురాలు ఎవరూ లేరన్నారు. గతంలో ఉన్న మార్గాలను అనుసరించకుండా కొత్త మార్గాలను సృష్టించుకుని అడుగు ముందుకు వేయడమే విజయ రహస్యమన్నారు. ఇటీవల అందం అంటే ఇన్‌స్టాగ్రామ్‌తో పాటు సోషల్ మీడియాల్లో కనిపించేదే అనుకునే భావనలో కొంతమంది ఉన్నారని, అలాంటి ఆలోచనను దూరం చేసుకుని మన చుట్టూ ఉన్న అందాన్ని గుర్తించాలని సూచించారు. ఎంతో గొప్ప వ్యక్తిత్వం కలిగిన నానమ్మలు, అమ్మమ్మలు, అత్తమ్మలను చూడాలని, వాటి వెనుకున్న అనుభవ జ్ఞానం, అందం గుర్తించుకోవాలన్నారు. గ్లామర్ అంటే సౌకర్యంగా ఉండాలి. తప్ప ఇబ్బందిని కలిగించొద్దన్నారు. కార్యక్రమంలో వైఎఫ్ఎల్‌వో చైర్ పర్సన్ రిధీ జైన్‌తో పాటు పలువురు సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# పరీక్షలు గట్టెక్కుదాం ఇలా..

- సమీపిస్తున్న పది, ఇంటర్ పరీక్షలు
- జ్ఞాపక శక్తికి ఇలా పదును పెడదాం
- విషయ పరిజ్ఞానంపై ఆందోళన వద్దు: నిపుణులు
- ఆత్మ విశ్వాసంతోనే మంచి మార్కులు

*చదివింది గుర్తుండటం లేదని చాలా మంది విద్యార్థులు సతమతమవుతుంటారు. తరగతి గదిలో విన్న పాఠాలు బయటకు వచ్చే సమయానికి గుర్తుండవు. పరీక్షలకు సన్నద్ధమవుతుంటే ఎంత చదివినా.. తీరా పరీక్షల సమయానికి గుర్తుకు రావడం లేదని జుట్టు పీక్కునే పరిస్థితులు ఎదురవుతుంటాయి. గతం తాలూకు పరీక్షల అనుభవాన్ని దృష్టిలో పెట్టుకుని ఈ పరీక్షల కాలాన్ని గట్టెక్కేందుకు విద్యార్థులు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని నిపుణులు చెబుతున్నారు. చదివింది గుర్తుంచుకోవడం ఎలా? అనే దానిని ప్రధానంగా తెలుసుకోవాలని అంటున్నారు. జ్ఞాపక శక్తిని పెంచుకుని ఒత్తిడి, ఆందోళన లేకుండా ఎలా ఉండాలో నిపుణులు సూచనలు చేశారు. – సిటీబ్యూరో, ఫిబ్రవరి 27(నమస్తే తెలంగాణ):*

### పుస్తక పఠనంతోనే జ్ఞాపక శక్తి అధికం: మోతుకూరి రామచంద్రం, సైకాలజిస్టు.



పలుమార్లు చదివినా అవసరానికి ఏవీ జ్ఞాపకం రావు. ప్రతి ఒక్కరు నిత్యం ఏదో ఒకటి గుర్తుకు రాక బాధపడుతుంటారు. చిన్న వయసు నుంచే పుస్తకాలు చదివించడం అలవాటు చేయాలి. దాని వల్ల జ్ఞాపక శక్తి పెరుగుతుంది. ప్రతి విద్యార్థి ఆత్మ విశ్వాసంతో ఉండాలి. కష్టమైనా.. పరీక్ష రాయక తప్పదు. అన్ని ప్రశ్నలకు జవాబులు రాయగలననే ధీమా తప్పనిసరి. సంకల్ప బలంతో పరీక్ష గదిలో కూర్చోవాలి. అంతా మంచి జరుగుతుందనే మన మేధస్సును సానుకూల దృక్పథంతో ప్రతిస్పందించేలా చేస్తుంది. అప్పుడే చదివిన అంశాలు గుర్తుంటాయి.

### మెదడుకు పదును..!!

- చేతిలో ఫోన్ ఉంది కదా అని ప్రతి దానికి గూగుల్‌పై ఆధారపడితే జ్ఞాపక శక్తి తగ్గుతుంది.
- మెదడులోని న్యూరోసెల్స్ పనిచేయవు. మనసులో విపరీతమైన అలజడిని సృష్టించే విషయాలు గురించి ఆలోచించడం మానేయాలి. అందుకు కారణమయ్యే వారి నుంచి దూరంగా ఉండాలి. లేకపోతే అవి మెదడులోని నరాలపై ప్రభావం చూపి మానసిక వైకల్యం వచ్చే ప్రమాదం ఉంది.
- ఒమేగా 3 ఫ్యాటీ ఆమ్లాలు మెదడును ఆరోగ్యవంతంగా ఉంచుతాయి. ఇవి ప్రతి కణాన్ని ప్రేరేపితం చేస్తాయి. పండ్లు, ఆకు కూరలు, సాల్మన్, ట్యూనా వంటి పలు రకాల చేపలు మేధో సంపత్తిని పెంచుతాయి.
- స్మోకింగ్, మద్యపానం వల్ల మతి మరుపు వస్తుంది. ఈ అలవాట్లు ముదిరితే మేధోశక్తి పాడైపోతుంది. విద్యార్థులు ఎట్టి పరిస్థితుల్లో ఇటువంటి ప్రాణాంతక అలవాట్లకు దగ్గర కాకూడదు.
- వేయించిన ఆహార పదార్థాల జోలికి వెళ్లకూడదు. జంక్ ఫుడ్స్‌కు దూరంగా ఉండాలి.
- ఒమేగా – 8 అధికంగా కలిగిన పొద్దు తిరుగుడు, ద్రాక్ష విత్తనాల నూనె వినియోగించడం వల్ల డిమెన్షియా, మతిమరుపును అధిగమించొచ్చు.
- ఆలోచనలు స్పష్టంగా ఉండాలంటే ప్రతి మనిషి రోజుకు 6 నుంచి 8 గంటల నిద్ర పోవాలి. అలసిన మెదడులోని కణాలను సేద తీరేందుకు సమయం ఇవ్వాలి. లేకపోతే అవి మరింతగా అలిసిపోయి క్షీణించే ప్రమాదం ఉంది.
- వ్యాయామం, యోగా చేయాలి. సుడోకు, చెస్, వైకుంఠపాళి వంటివి ఆడాలి. సామాజిక అంశాలపై చర్చించాలి.

### సబ్జెక్టు అంటే భయపడకూడదు: లక్ష్మి, సైకాలజిస్టు



పాఠం చెప్పడం కన్నా.. అది ఎలా గుర్తుంచుకోవాలో చెప్పడమే ప్రధానం. నేర్చుకున్నవన్నీ వీలున్నప్పుడల్లా పునరుశ్చరణ చేసుకోవాలి. ఆందోళన, ఒత్తిడికి దూరంగా ఉండాలి. ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల ప్రోత్సాహం అవసరం. పరీక్షలకు అరగంట ముందు పాఠ్యాంశాలను చర్చించకూడదు. అలా చేస్తే గందరగోళంలో పడతారు. ప్రశ్నాపత్రం అందగానే రెండు నిమిషాలు ధ్యానం చేస్తే.. మనసులోనే వేర్వేరు ఆలోచనలు రావు. ప్రశాంతంగా పరీక్ష రాసుకునే శక్తి వస్తుంది. సబ్జెక్టు అంటే భయపడకూడదు. గణితం రాదని, సైన్స్ అంటే భయం అనే ఆలోచనలు ఉండరాదు. ప్రతిదాన్ని ఇష్టంతో చదవాలి.



జూబ్లీహిల్స్‌లోని టీటీడీ శ్రీ వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా చిన్న శేష వాహనంపై ఊరేగుతున్న స్వామివారు

## వైభవంగా వెంకన్న బ్రహ్మోత్సవాలు

బంజారాహిల్స్, ఫిబ్రవరి 27: జూబ్లీహిల్స్‌లోని టీటీడీ శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శ్రీవారిని చిన్న శేష వాహనంపై గురువారం మాడ వీధుల్లో ఊరేగించారు. ఈ సందర్భంగా గోవింద నామస్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. అంతకు ముందు స్వామి వారికి సుప్రభాత సేవ, స్నపన తిరుమంజనం తదితర సేవలు నిర్వహించారు. సాయంత్రం స్వామి వారికి ఊంజాల్ సేవ నిర్వహించిన అనంతరం, రాత్రి హంస వాహనంపై స్వామి వారిని ఊరేగించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## చికెన్ మేళాకు భారీగా స్పందన



చికెన్ మేళాలో చికెన్ ఫ్రై, గుడ్లను పంపిణీ చేస్తున్న వెన్ కాబ్ ప్రతినిధులు

చిక్కడపల్లి, ఫిబ్రవరి 27: చికెన్ తినడం సురక్షితమని 70 డిగ్రీల సెల్సియస్ మించిన వేడిలో చికెన్, గుడ్లు వండటం వల్ల బర్డ్ ఫ్లూ వైరస్ ఉన్నా చనిపోతుందంటూ సాక్షాత్తూ ప్రపంచ ఆరోగ్య సంస్థ స్పష్టం చేసిందని వెన్ కాబ్ పౌల్ట్రీ సంస్థ ప్రతినిధి తెలిపారు. చికెన్ పట్ల ప్రజల్లో ఉన్న అపోహలను తొలగించడానికి గురువారం సాయంత్రం గాంధీ నగర్ లోని డైమండ్ చికెన్ సెంటర్ వద్ద. వెన్ కాబ్ చికెన్, పౌల్ట్రీ బ్రీడర్స్ అసోసియేషన్, నేషనల్ ఎగ్ –కోఆర్డినేషన్ కమిటీ, ఆధ్వర్యంలో చికెన్ మేళాను నిర్వహించారు. ఈ సందర్భంగా 200 కిలోల చికెన్ ఫ్రై, 2000 ఉడకపెట్టిన గుడ్లను ఉచితంగా పంపిణీ చేశారు. చికెన్ మేళాకు ప్రజల నుంచి భారీ స్పందన లభించింది. ఈ సందర్భంగా వెన్ కాబ్ చికెన్ ప్రతినిధి సెంథిల్ కుమార్, వెన్ కాబ్ చికెన్ డీలర్ ఫయుం లు మాట్లాడుతూ భారత దేశంలో 100 డిగ్రీల సెల్సియస్ కంటే ఎక్కువ వేడిలోనే చికెన్, గుడ్లు వండుతారని.. అందువల్ల ఎలాంటి హాని ఉండదని చెప్పారు. ఈ కార్యక్రమంలో డైమండ్ చికెన్ సెంటర్ నిర్వాహకుడు కలీం, వెన్ కాబ్ చికెన్ సంస్థ ప్రతినిధులు వినోద్, తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్లపై స్పష్టతేదీ?

- మేడ్చల్ -మల్కాజిగిరి జిల్లాలో ఇందిరమ్మ ఇళ్లకు 1,43,267
- పథకం ప్రారంభం రోజున మంజూరు చేసింది.. 308 మందికే
- మిగతా లబ్ధిదారుల ఎంపిక ఎప్పుడు?: దరఖాస్తుదారులు

మేడ్చల్, ఫిబ్రవరి27(నమస్తే తెలంగాణ): ఇందిరమ్మ ఇళ్ల ఎంపికపై స్పష్టత లేకుండా పోయింది. పథకం ప్రారంభించిన రోజున మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో 308 మంది లబ్ధిదారులకు మాత్రమే ఇందిరమ్మ పథకాన్ని మంజూరు చేసి ధ్రువపత్రాలు అందజేశారు. అయితే, మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా వ్యాప్తంగా ఇందిరమ్మ ఇంటి పథకానికి 1,43,267 దరఖాస్తులు వచ్చాయి. మిగతా దరఖాస్తుదారులకు సంబంధించి ఇందిరమ్మ పథకానికి ఎంపిక ఎప్పుడు చేస్తారని దరఖాస్తుదారులు అధికారులను ప్రశ్నిస్తున్నారు. అయితే, గతంలో జరిగిన గ్రామ సభలలో అర్హుల ఎంపికలో అనేక అవకతవకలు జరిగాయని గ్రామ సభలలో దరఖాస్తుదారులు ప్రశ్నించడంతో తిరిగి దరఖాస్తులను రీ సర్వే చేస్తామని హామీ ఇచ్చిన విషయం తెలిసిందే. కాగా, మిగతా దరఖాస్తులను ఎప్పుడు పరిశీలించి ఇందిరమ్మ ఇంటి పథకానికి లబ్ధిదారుల ఎంపిక ఎప్పుడు చేస్తారని దరఖాస్తుదారులు ఎదురు చూస్తున్నారు. ఇందిరమ్మ ఇంటి పథకంపై అధికారులకు కూడా స్పష్టత లేనట్లు కనిపిస్తుంది. ఇందిరమ్మ ఇంటి పథకానికి సర్వే పూర్తయ్యిందని, మరోసారి పథకానికి వచ్చిన దరఖాస్తులను రీ సర్వే చేస్తున్నట్లు అధికారులు చెబుతున్న క్రమంలో దరఖాస్తుదారులలో అనేక అనుమనాలు వస్తున్నాయి.

### 1,43,267 దరఖాస్తుదారులు - సొంత స్థలాలు 8,475 మందికే..

ఇందిరమ్మ ఇళ్ల పథకానికి సొంత స్థలం ఉన్నవారికే మొదట ప్రాధాన్యత ఇస్తారా? లేక ఏమీ లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇంటి పథకాన్ని వర్తింపజేస్తారా? అన్నది అధికారులకు కూడా ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేదని తెలుస్తుంది. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో ఐదు నియోజకవర్గాలకు సంబంధించి మొదటి విడతలో 17,500 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయాలని నిర్ణయించిన జీహెచ్ఎంసీ పరిధిలోని నియోజకవర్గాలలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికపై ఇంకా సర్వేనే ప్రారంభించ లేదు. అయితే, 13 మున్సిపాలిటీల పరిధిలో సొంత స్థలాలు కలిగిన వారు 8,475 మంది ఉంటే, వీరందరికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసినా.., సొంత స్థలాలున్నవారు అనేక మంది మిగిలిపోనున్నారు. అసలు స్థలం లేని వారికి ఇందిరమ్మ ఇండ్లను ప్రస్తుతం మంజూరు చేసే పరిస్థితి కనిపించడం లేదని అధికారుల ద్వారా తెలుస్తోంది.

### లబ్ధిదారుల ఇంటి పనుల ప్రారంభంపై..

ఇందిరమ్మ ఇంటి పథకం పొందిన లబ్ధిదారులు, ఇంటి పనుల ప్రారంభించుకునేందుకు ఇంకా అధికారుల నుంచి ఎలాంటి స్పష్టత రాలేదు. జిల్లా వ్యాప్తంగా 308 మందికి ఇందిరమ్మ ఇంటి పథకం వర్తింపజేస్తూ ధ్రువపత్రాలను అందించిన విషయం తెలిసిందే. ఇంటి పనులు ప్రారంభించే ముందు ఏమైనా లబ్ధిదారులకు నగదు అందించే విషయమై ఇప్పటి వరకు లబ్ధిదారులకు ఎలాంటి సమాచారం అందలేదని తెలిపారు. అయితే, ప్రభుత్వం మాత్రం నాలుగు దశలలో నగదును అందించేందుకు ప్రణాళిక సిద్ధం చేసిందని చెబుతున్నప్పటికి అమలు ఎప్పుడు అవుతుందోనన్న ఆందోళనను లబ్ధిదారులు వ్యక్తం చేస్తున్నారు.




## హోలీ మేరీ కళాశాల చైర్మన్‌కు ఘన సన్మానం

సిటీబ్యూరో, ఫిబ్రవరి 27(నమస్తే తెలంగాణ): హోలీ మేరీ ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ ఆరిమండ సిద్ధార్థ రెడ్డికి గ్రీస్ యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్ ప్రదానం చేసింది. ఈ సందర్భంగా గురువారం కళాశాల సిబ్బంది, విద్యార్థులు ఆయనకు ఘనంగా సన్మానం చేశారు. కార్యక్రమంలో డైరెక్టర్ విజయ శారద రెడ్డి, ప్రిన్సిపాల్ ప్రీతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మానవ సంక్షేమానికి సైన్స్ భరోసా

**రాష్ట్రపతి నిలయంలో ఘనంగా సైన్స్ దినోత్సవం**



జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభిస్తున్న ముఖ్య అతిథులు సీసీఎంబీ మాజీ డైరెక్టర్ మోహన్ రావు , ఐసీఎంఆర్ మాజీ డైరెక్టర్ శశికిరణ్

బొల్లారం, ఫిబ్రవరి 27: సైన్స్ ప్రాధాన్యతను నేటి అవసరాలకు అనుగుణంగా ఉపయోగించుకుంటూ, ప్రపంచ సవాళ్లను తగ్గించడంలో, మానవ సంక్షేమానికి భరోసా ఇవ్వడంతో పాటు శాస్త్రీయ జ్ఞానాన్ని విస్తృతం చేయాలని సీసీఎంబీ మాజీ డైరెక్టర్ సీహెచ్ మోహన్ రావు అన్నారు. బొల్లారం రాష్ట్రపతి నిలయంలో గురువారం జాతీయ సైన్స్ వేడుకలను నిలయం అధికారులతో జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సీసీఎంబీ మాజీ డైరెక్టర్ మోహన్ రావు, నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్ (ఐసీఎంఆర్) మాజీ డైరెక్టర్ శశి కిరణ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ మోహన్ రావు స్పెక్ట్రోస్కోపీ దాని రంగంలో ప్రాముఖ్యతను వివరించారు. అంతర్ దృష్టిలో సర్ సీవీ రామన్ కాంతి అణువులు, రామన్ ఎఫెక్ట్ ఫలితంగా అణువుల ద్వారా కాంతిని వెదజల్లడం వంటి ఆవశ్యకతను వివరించారు. అనంతరం, ఐసీఎంఆర్ మాజీ డైరెక్టర్ శశి కిరణ్ సైన్స్ పై దృష్టి సారిస్తూ అనేక ఆరోగ్య విషయాలను వివరించారు. సరైన తయారీ పోషక విలువలను సంరక్షించడంతో పాటు అనారోగ్యకరమైన ప్రమాదాలను ఎలా నివారించుకోవచ్చు వెల్లడించారు. అదే విధంగా పేద వర్గాల్లో ప్రారంభ దశలో గుండె పోటుల పెరుగుదలను ప్రస్తావించారు. దీనికి పేద తల్లి పోషకాహారం, తక్కువ జనన బరువు కారణమని పేర్కొన్నారు. ఆహారపు అలవాట్లతో పాటు జీవన శైలిని మార్చుకోవాలని సూచించారు.

### వేడుకల్లో పలు ప్రదర్శనలు...

సెంటర్ ఫర్ డీఎన్ఏ ఫింగర్ ప్రింటింగ్ అండ్ డయాగ్నస్టిక్స్(సీడీఏఎఫ్‌డీ), నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ ( ఎన్ఆర్ఎస్సీ), సీఎస్ ఐఆర్ –సెంటర్ ఫర్ సెల్యూలర్ అండ్ మాలిక్యులర్ బయాలజీ(సీసీఎంబీ), సర్వే ఆఫ్ ఇండియా, నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్(ఎన్ఐఎన్) , నేషనల్ జియోఫిజికల్ రీసెర్చ్ ఇన్స్టిట్యూట్(ఎన్జీఆర్ఐ) సంస్థలు తమ పరిశోధన, అభివృద్ధి ఆవిష్కరణలను ప్రదర్శించడానికి స్టాల్స్ ఏర్పాటు చేశాయి. అదే విధంగా జన విజ్ఞాన వేదిక, డెక్కన్ హెరిటేజ్ అకాడమీ ట్రస్ట్ విజ్ఞాన, సాంకేతికత, వారసత్వంపై పుస్తక ప్రదర్శన నిర్వహించారు. భారతదేశంలోని శాస్త్రజ్ఞుల ఫొటో ప్రదర్శన, ప్రముఖ శాస్త్రవేత్తల అకాడమిక్స్, ఇన్నోవేటర్స్ ఆధ్వర్యంలో విజ్ఞానంలో పురోగతి, శాస్త్రంతో సరదా, సైన్సును అవగతం చేసుకోవడంతో పాటు కెరీర్లు అంతరిక్ష అన్వేషణ, శాస్త్రంలో ఆవిష్కరణలు వంటి విభిన్న ఆసక్తికర అంశాలను ఉద్దేశించి వర్క్ షాపులు ఏర్పాటు చేశారు. ఈ మేరకు నిలయం అధికారిని రజినీ ప్రియ మాట్లాడుతూ, క్విజ్, సైన్స్ మోడల్ ఎగ్జిబిషన్లు, పోస్టర్ మేకింగ్ వంటి పోటీలు నిర్వహించామని ఈ వేడుకలను గురువారం ఒక్కరోజే సుమారు 2,700 మంది విద్యార్థులు సందర్శించినట్లుగా పేర్కొన్నారు.

## శిల్పారామానికి గోల్డ్ గార్డెన్ సర్టిఫికెట్



గోల్డ్ గార్డెన్ సర్టిఫికెట్, జ్ఞాపికతో శిల్పారామం ప్రత్యేక అధికారి కిషన్ రావు

కొండాపూర్, ఫిబ్రవరి 27: తెలంగాణ ప్రభుత్వం హార్టికల్చర్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన 8వ గార్డెన్ ఫెస్టివల్లో మాదాపూర్లోని శిల్పారామం గోల్డ్ గార్డెన్ సర్టిఫికెట్‌కు ఎంపికయ్యింది. హార్టికల్చర్ అండ్ సెమీ కల్చర్ డైరెక్టర్ యాస్మిన్ బాషా చేతుల మీదుగా శిల్పారామం ప్రత్యేక అధికారి కిషన్ రావు సర్టిఫికెట్‌తో పాటు జ్ఞాపికను అందుకున్నారు. ఈ సందర్భంగా కిషన్ రావు మాట్లాడుతూ, ఆహ్లాదానికి, పచ్చదనానికి కేరాఫ్‌గా నిలుస్తున్న శిల్పారామం ఈ అవార్డుకు ఎంపికవడం సంతోషంగా ఉంది. శిల్పారామాన్ని ఇక ముందు రమణీయంగా ఉంచేందుకు కృషి చేస్తామని తెలిపారు.

# టీఎస్ ఈ పాస్ స్కాలర్ షిప్ లను విడుదల చేయాలి

**హెచ్‌సీయూలో విద్యార్థుల ఆందోళన**



కొండాపూర్, ఫిబ్రవరి 27: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ వద్ద ఉద్రిక్త వాతావరణం నెలకొంది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం బీసీ, ఎస్సీ, ఎస్టీ లకు అందించే టీఎస్ ఈ పాస్ స్కాలర్షిప్ లను మంజూరు చేయకుండా కాలయాపన చేస్తుందంటూ వర్సిటీ స్టూడెంట్ యూనియన్ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిల దిష్టిబొమ్మలను దగ్ధం చేసేందుకు విద్యార్థులు సిద్ధమవుతున్న విషయాన్ని తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలికి చేరుకొని ఆందోళన చేస్తున్న విద్యార్థులను వెనక్కి పోవాలని సూచించారు. విద్యార్థులు పోలీసులు డౌన్ డౌన్, రేవంత్ రెడ్డి ముర్దాబాద్ అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ ఆందోళనకు దిగారు. సామరస్యంగా చేస్తున్న ఆందోళనను అడ్డుకోవడం ఏంటంటూ విద్యార్థులు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం వెనుకబడిన తరగతులు విద్యార్థుల బాధలను విస్మరించి స్కాలర్షిప్లను మంజూరు చేయకుండా ఇబ్బందులకు గురి చేస్తుందని, మా బాధను వెల్లడించుకోవడం కూడా తప్పేనా? అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు బాకీ పడ్డ ₹8,248 కోట్ల స్కాలర్ షిప్ లను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. నిరుపేద విద్యార్థులు గ్రామాల నుంచి చదువుల కోసం పట్టణాలకు వచ్చి ఉన్నత విద్యను అభ్యసిస్తున్నారని, మెస్ ఫీజులు, ట్యూషన్ ఫీజులు, ఇతర అవసరాలకు డబ్బులు లేక తీవ్ర అవస్థలు పడుతున్నారని, ఇకనైనా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్కాలర్షిప్లను వెంటనే మంజూరు చేసేలా చూడాలంటూ డిమాండ్ చేశారు. పోలీసులు రాజకీయ నాయకులకు మాత్రమే పనికి వచ్చేలా చేస్తున్నారని, సామరస్యంగా ఆందోళన చేస్తున్న మమ్మల్ని అడ్డుకోవడం ఏంటని ప్రశ్నించారు.

## జీహెచ్ఎంసీ కార్యాలయాల్లో సీసీ కెమెరాలు

**అధికారులు, సిబ్బంది సమయా పాలన పాటించే విధంగా చర్యలు**

**జీహెచ్ఎంసీ కమిషనర్ కీలక నిర్ణయం**

సిటీబ్యూరో, ఫిబ్రవరి 27(నమస్తే తెలంగాణ): జీహెచ్ఎంసీ జోనల్ అధికారులు ఇక మీదట సమయా పాలన పాటించాల్సిందే! నిత్యం ప్రజలు అందుబాటులోకి ఉండాల్సిందే, సమావేశాలు, సైట్ విజిట్ ఇతర కారణాల పేరుతో కొందరు కార్యాలయాల్లో ఉండకుండా ప్రజా సేవలకు దూరంగా ఉంటున్నారన్న సమాచారంతో కమిషనర్ ఇలంబర్తి కీలక నిర్ణయం తీసుకున్నారు. జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో అన్ని విభాగాల హెచ్ఓడీలు, సిబ్బంది సమయా పాలన పాటించేలా ఆర్టిఫీషియల్ (ఏఐ) సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. ఈ విధానాన్నే జోనల్, డిప్యూటీ కమిషనర్ కార్యాలయాల్లో తక్షణమే అమలు చేయాలని ఐటీ విభాగం అడిషనల్ కమిషనర్‌కు కమిషనర్ ఇలంబర్తి ఆదేశాలు జారీ చేశారు. తక్షణమే జోనల్, డిప్యూటీ కార్యాలయాలలో అధికారులు, సిబ్బంది సమయా పాలన పాటించే విధంగా చర్యలు తీసుకోవాలని కమిషనర్ సూచించారు.

## వ్యవసాయ సంక్షేమానికి 20% బడ్జెట్ కేటాయించాలి

**కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేసిన పలువురు వక్తలు**

**'కేంద్ర రాష్ట్ర బడ్జెట్లు-రైతుల వ్యవసాయంపై ప్రభావం' పై రౌండ్ టేబుల్ సమావేశం**



తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తీగల సాగర్

చిక్కడపల్లి, ఫిబ్రవరి 27: రైతుల వ్యవసాయ సంక్షేమానికి 20 శాతం బడ్జెట్ ను కేటాయించాలని పలువురు వక్తలు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. బడ్జెట్లలో కార్పొరేట్ శక్తులకు వరాలు రైతులకు భారాలు మోపారని మండిపడ్డారు. అఖిల భారత రైతు సమాఖ్య (ఏఐకేఎఫ్), అఖిల భారత వ్యవసాయ కార్మిక సమైక్య (ఏఐఏడబ్ల్యుఎఫ్) రాష్ట్ర కమిటీల ఆధ్వర్యంలో ''కేంద్ర రాష్ట్ర బడ్జెట్లు–రైతుల వ్యవసాయంపై ప్రభావం'' అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం గురువారం బాగ్ లింగంపల్లి ఓంకార్ భవన్ లో నిర్వహించారు. తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తీగల సాగర్, ఏఐకేఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెద్దారపు రమేశ్, ఏఐకేఎంఎస్ రాష్ట్ర కార్యదర్శి మండల వెంకన్న, తెలంగాణ రైతాంగ సమితి రాష్ట్ర అధ్యక్షుడు జక్కుల వెంకటయ్య, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కాంతయ్య, ఏఐఏడబ్ల్యుఎఫ్ రాష్ట్ర కార్యదర్శి గోనె కుమారస్వామి, ఏఐఏడబ్ల్యుయు రాష్ట్ర ఉపాధ్యక్షుడు బుర్రి ప్రసాద్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మానవ మనుగడకు దేశ అభ్యున్నతికి జీవనాధారమైన దేశీయ వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యం చేస్తూ బడ్జెట్లలో తగిన నిధులు కేటాయించకుండా కార్పొరేట్ వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తూ, రైతుల సంక్షేమాన్ని విస్మరించడం అన్యాయమన్నారు. ఏఐకేఎఫ్, ఏఐఏడబ్ల్యుఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వస్కుల మట్టయ్య, వరికుప్పల వెంకన్నల అధ్యక్షతన వహించిన సమావేశంలో జక్కుల నరసింహ, ఏఐసీటీయూ రాష్ట్ర కార్యదర్శి రాయబండి పాండురంగం ఏఐకేఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎన్ రెడ్డి హంసారెడ్డి, ఏపూరి సోమన్న, కుర్ర రవీందర్ గౌడ్, ప్రభాకర్ రెడ్డి, వరికెల కిషన్, మానయ్య, మోహన్ నాయక్, మారయ్య, బాలరాజు, తదితరులు పాల్గొన్నారు.

## విస్తృత అంశాలపై అవగాహనతో పరిజ్ఞానం మరింత పరిపుష్టం

**తెలుగు విశ్వవిద్యాలయం పూర్వ ఉపాధ్యక్షులు ఆచార్య అనుమాండ్ల భూమయ్య**



సదస్సుకు హాజరైన వివిధ విశ్వవిద్యాలయాల అధ్యాపకులు

కొండాపూర్, ఫిబ్రవరి 27: పరిశోధనలో నూతనాంశాలను వివరించడానికి తెలుగుతో పాటు సంస్కృత, ఆంగ్ల భాషలను నేర్చుకోవాలని విస్తృత అంశాలపై అవగాహనతో పరిజ్ఞానం మరింత పరిపుష్టం అవుతుందని తెలుగు విశ్వవిద్యాలయం పూర్వ ఉపాధ్యక్షులు ఆచార్య అనుమాండ్ల భూమయ్య పేర్కొన్నారు. హెచ్ సీయూలో గురువారం ప్రారంభమైన రెండు రోజుల అంతర్జాతీయ సదస్సు ప్రారంభోత్సవ సభలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై కీలకోపన్యాసం చేశారు. ఈ సదస్సుకు తెలుగు శాఖ అధ్యక్షులు, సదస్సు సంచాలకులు ఆచార్య పిల్లలమర్రి రాములు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆచార్య అనుమాండ్ల భూమయ్య మాట్లాడుతూ, తెలుగు భాషా సాహిత్యాలలో జరుగుతున్న పరిశోధనలపై సమీక్ష చేసుకోవడంతో పాటు, భవిష్యత్తులో జరగవలసిన పరిశోధనాంశాలను గుర్తించేందుకు ప్రయత్నించడమే ఈ సదస్సు లక్ష్యమని, పరిశోధకుల్లో శారీరక, మానసిక ఆరోగ్యం కూడా మంచి పరిశోధనలు చేయడానికి దోహదపడతాయన్నారు. విశ్వవిద్యాలయాల్లో తగినంత మంది అధ్యాపకులు లేకపోవడం వల్ల పరిశోధనలు తగ్గుముఖం పడుతున్నాయని చెప్పారు. తమ సామాజిక, ప్రాంతీయ అస్తిత్వాలను అన్వేషించే దిశగా పరిశోధనలు జరగాల్సిన అవసరం ఉందని సీనియర్ పాత్రికేయులు డాక్టర్ కె.శ్రీనివాస్ చెప్పారు. అమెరికా, మరికొన్ని దేశాలలో తెలుగు భాషా సాహిత్యాలను నేర్చుకోవడం, అధ్యయనం చేయడం ఇప్పుడిప్పుడే ప్రారంభమవుతున్నాయని పెన్సిల్వేనియా విశ్వవిద్యాలయం ఆచార్యులు అఫ్సర్ చెప్పారు. డయాస్పోరా సాహిత్యాన్ని ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు విశ్వవిద్యాలయం స్థాయిలో ఒక పాఠ్యాంశం చేశారని తెలిపారు. అనంతరం, జరిగిన మూడు సమావేశాల్లో వివిధ విశ్వవిద్యాలయాలకు చెందిన అధ్యాపకులు ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు, ఆచార్య ఎం.గోనా నాయక్, ఆచార్య పమ్మి పవన్ కుమార్, ఆచార్య పి.వారిజారాణి, ఆచార్య త్రివేణి వంగరి, ఆచార్య పేట శ్రీనివాసులు రెడ్డి, ఆచార్య బూదాటి వెంకటేశ్వర్లు, ఆచార్య సి.కాశీం, డా. సీహెచ్ లక్ష్మణ చక్రవర్తి, డా. ఎన్.రజని, డా. పి.విజయ్ కుమార్, డా. వెల్దండి శ్రీధర్, డా. సంగిశెట్టి శ్రీనివాస్ తదితరులు వివిధ అంశాలపై పత్ర సమర్పణ చేశారు. సమావేశాల్లో డా.భూక్యా తిరుపతి, డా. భుజంగరెడ్డి, డా. బాశెట్టి లత, విద్యార్థులు పాల్గొన్నారు.